క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



గిరాయిపల్లిలో మృతిచెందిన రైతు కుటుంబాన్ని ఓదార్చుతున్న నర్సారెడ్డి

కొండపాక(గజ్వేల్): మండలంలోని గిరాయిపల్లిలో కరెంట్ షాక్‌తో రైతు సంతోష్‌కుమార్‌చారి మృతిచెందగా బాధిత కుటుంబాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పరామర్శించారు. రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీకి సంతోష్ కుమార్ అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు లింగారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం



నూతన పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న సింగిల్ విండో చైర్మన్ శివయ్య

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని అంతక్కపేట గ్రామ శివారు.. కట్కూర్ క్రాసింగ్ వద్ద విశాల పరపతి సహకార సంఘం వారి భారత్ పెట్రోల్ బంకును శుక్రవారం హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య ప్రారంభించారు. నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌లను వినియోగదారులకు అందిస్తామన్నారు. అలాగే ఉచితంగా ద్విచక్రవాహనాలకు ఆయిల్ ఛేంజ్ సర్వీస్‌ను అందుబాటులో తీసుకొచ్చామన్నారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగ్గిడి అయిలయ్య, డైరెక్టర్లు బండి కుమార్, రామచంద్రారెడ్డి, భారత్ పెట్రోల్ కంపెనీ ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

కోహెడరూరల్(హుస్నాబాద్): ఒక గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన కోహెడ రూరల్ మండలం గుండారెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఓ వ్యవసాయ బావి వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని పంచాయతీ సిబ్బంది గుర్తించారు. సుమారుగా 65 ఏళ్ల వృద్ధుడు కాగా.. అతను తెలుపు గీతల షర్ట్ ధరించాడని పోలీసులకు సమాచారం అందించారు. ఇక్కడికి చేరుకొని మృతుడి ఆచూకీ కోసం అందరినీ అడిగారు. ఎవరైనా తెలిసిన వారు ఉంటే తమకు సమాచారం అందించాలన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లింగాకర్షణ ఎరలపై రైతులకు అవగాహన



లింగాకర్షణపై అవగాహన కల్పిస్తున్న ఏఈఓ శ్రీలత

అక్కన్నపేట(హుస్నాబాద్): పత్తిలో ఆశించే గులాబీ రంగు పురుగు నివారణకు పంట చేనులలో లింగాకర్షణ ఏరల వాడకం గురించి వ్యవసాయ విస్తరణాధికారి కరంటోతు శ్రీలత తెలిపారు. దీంతో ఆడతల్లి పురుగులు ఆకర్షించబడి బుట్టలో పడిపోవడం వల్ల పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండలం జనగామలో పత్తి పంటలు వేసిన రైతుల పొలంలో లింగాకర్షణ బుట్టలను వాడటంతో కలిగే లాభాలను తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పురుగు మందులకు అయ్యే ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. పురుగు ఉధృతి తెలుసుకోవడానికి ఎకరానికి 4, పురుగు నివారణకు ఎకరానికి 10 బుట్టలను అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు ముద్దవల్ల రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా కోరే హక్కు లేదు: బీఆర్‌ఎస్ నాయకులు

నంగునూరు(సిద్దిపేట): రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయని సీఎం రేవంత్‌రెడ్డి మాజీ మంత్రి హరీశ్‌రావును రాజీనామా చేయాలని కోరే నైతిక హక్కు లేదని బీఆర్‌ఎస్ నాయకులు ఎద్దేవా చేశారు. శుక్రవారం నంగునూరులో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి చిత్తశుద్ధిని చాటాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు లింగంగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, సోమిరెడ్డి, సారయ్య, కృష్ణారెడ్డి, పురేందర్, నాగేంద్రం, తిరుపతి, వేణుగోపాల్, మహేందర్‌గౌడ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

వరాల తల్లికి వందనం

శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవార్లకు పూలు, పండ్లు నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. సామూహిక కుంకుమార్చనలు చేశారు. అనంతరం ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. వరలక్ష్మి అమ్మవారి కృపా కటాక్షాలు ఉండి, సకల సౌభాగ్యాలు కలుగాలని కోరుకున్నారు.

– నెట్‌వర్క్



కోహెడలో..



గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌లో..



మద్దూరులో..



చిన్నకోడూరులో



హుస్నాబాద్: పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రజిత



హుస్నాబాద్: సంతోషిమాతా దేవాలయంలో..

అవగాహనతోనే క్షయ నివారణ

నంగునూరు(సిద్దిపేట): క్షయ వ్యాధిపై అవగాహన పెంచుకుంటే వ్యాధి నివారణ సాధ్యమవుతుందని టీబీ అలర్ట్ ఇండియా ఇంపాక్ట్ ప్రోగ్రామ్ సిద్దిపేట జిల్లా అధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రాజగోపాల్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాలమాకుల సబ్‌సెంటర్‌ను ఆయన సందర్శించారు. మండలంలో బాధితుల వివరాలను సేకరించి మందులపై ఆరా తీశారు. క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స సులభతరంగా మారి పూర్తిగా నయం చేయొచ్చన్నారు. దగ్గు, ఆకలి మందగించడం, జ్వరం, ఆయాసం, బరువు తగ్గడం లాంటి లక్షణాలుంటే దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందజేస్తామని, వైద్యసిబ్బంది నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ డాక్టర్ శివకుమార్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

షీటీమ్స్‌తో మహిళలకు రక్షణ

సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: జిల్లాలోని షీటీమ్స్ మహిళలు, బాలికల భద్రత, భరోసా కోసం పనిచేస్తున్నట్లు సిద్దిపేట సీపీ అనురాధ శుక్రవారం తెలిపారు. జిల్లాలోని షీటీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్స్ అధికారులు ఈనెల 1 నుంచి 15 వరకు వివిధ కళాశాలల్లో అవగాహన కల్పించారని తెలిపారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కు గురైతే షీటీమ్ వాట్సప్ నంబర్ (87126-67434)కు ఫోన్ చేయాలని తెలిపారు. మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. 13 మంది ఈవ్ టీజర్లను పట్టుకొని వారికి కౌన్సెలింగ్ నిర్వహించి పెట్టి కేసులు నమోదు చేశామన్నారు. నూతన చట్టాలతో నేరస్తులకు కఠిన శిక్షలు అమలు చేస్తామని తెలిపారు.

బెల్ట్ షాపుల దందా

- విచ్చలవిడిగా అమ్మకాలు
- మూడు పువ్వులు ఆరు కాయలన్నట్లుగా వ్యాపారం
- పట్టించుకోని అధికారులు

ములుగు(గజ్వేల్): గ్రామాల్లో బెల్ట్‌షాపుల దందా జోరుగా సాగుతోంది. పల్లెలు, మారుమూల గ్రామాల్లో రేయింబవళ్లు విక్రయాలు జరుపుతున్నారు. ఇదే అదనుగా భావిస్తూ అధికధరలకు మద్యం విక్రయిస్తున్నారు. దీంతో మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లు వ్యాపారం సాగుతోంది. కాగా పొద్దంతా కష్టపడిన సొమ్ము తాగుడుకే తగలేస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ శాఖాధికారులు దృష్టి సారించాలని వేడుకుంటున్నారు.

ములుగు మండలం.. వంటిమామిడిలో 2, కొత్తూరులో 2, ములుగులో 1 చొప్పున మొత్తం ఆరు అధికారిక వైన్‌షాపులున్నాయి. ఇక్కడ మాత్రం ఎంఆర్పీ ధరలకు మద్యం అమ్ముతున్నారు. కానీ సిండికేట్ కారణంతో బెల్ట్‌షాపు నిర్వా



హకులు అదనంగా వసూలు చేస్తున్నారు. గ్రామాల్లో ఏ అర్ధ రాత్రి అయినా బెల్ట్‌షాపు తడితే చాలు కావలసినంతా దొరుకుతోంది. వాటివల్ల యువత పెడదారిలో పయనిస్తోంది. కాగా మండలంలోని పలు గ్రామాల్లో ఎక్కువ మంది పేరుకు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. సొంత ఇళ్లలో ఫ్రిజ్‌లు పెట్టుకుని మరీ విక్రయిస్తున్నారు. వైన్‌షాపుల యజమానులు కూడా ఊరూరా మద్యం సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే పొద్దంతా సంపాదించిన సొమ్మును పురుషులు మద్యానికి

> **బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు**
>
> గ్రామాల్లో అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే తనిఖీలు చేపట్టి షాపులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నాం.
>
> – మండల ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి

తగలేస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబాలు వీధిన పడుతున్నాయని వాపోతున్నారు.

వేలం!

కొన్ని గ్రామాల్లోనైతే బెల్ట్‌షాపుల నిర్వహణకు వేలం వేస్తున్నట్లు తెలుస్తోంది. సెలవు దినాల్లో సైతం అన్ని గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం దొరుకుతోంది. వైన్స్‌షాపుల యజమానులు ఒకరోజు ముందుగానే బెల్ట్‌షాపుల్లోకి సరుకు చేర వేసి మందుబాబులకు సమాచారం ఇస్తున్నట్లు తెలిసింది. బెల్ట్‌షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను ప్రజలు, మహిళలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

సిద్దిపేటజోన్: వరలక్ష్మీ వత్రాలను మహిళలు ఆచరించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు పండ్లు, పువ్వులు సమర్పించి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ముత్తయిదువులు, యువతులకు పసుపు కుంకుమ, పప్పు బెల్లం, ఫలతాంబులాలు, వస్త్రాలు, వాయినాలుగా ఇచ్చిపుచ్చుకున్నారు. ఆయా చోట్ల ఉన్న ఆలయాల్లో అర్చనలు చేయించి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సెలెస్టియల్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లోనూ ప్రత్యేక పూజలు



పూజలో సెలెస్టియల్ హైస్కూల్ విద్యార్థినులు

నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వై.హన్మంతరెడ్డి, బి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఏఆర్‌ఆర్ కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

రూ. 22వేల రికవరీకి ఆదేశం

చేర్యాల(సిద్దిపేట): ఉపాధి హామీ కింద మండలంలో చేపట్టిన పనులను ఆడిట్ బృందం తనిఖీ చేసి నివేదిక రూపొందించింది. శుక్రవారం మండల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మహబూబ్ అలీ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 18 గ్రామాల్లో ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు రూ 3.75కోట్లతో చేపట్టిన పనులను పరిశీలించారు. పెండింగ్ పనులు, కూలీల డబ్బులను చెల్లింపు తదితర విషయాలను చదివి వినిపించారు. హాజరు, మస్టర్ రోల్, ఆన్‌లైన్



సామాజిక ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

తప్పుడు ఎంట్రీ, ఇతరేత్ర అంశాలకు సంబంధించి మొత్తంగా రూ.22 వేలను రికవరీ చేయాలన్నారు. అడిషనల్ డీఆర్‌డీఓ బాలకృష్ణ, ఏపీడీ శివాజీ, ఆరీఫ్, గంగరాజు హాజరయ్యారు.

హరీశ్‌రావు రాజీనామా చేయాలి



దుబ్బాక: శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిందని, అది చేస్తే తాను రాజీనామా చేస్తానని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రకటించారని, ఇప్పుడు మాట నిలబెట్టుకోవాలని పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేశారన్నారు. మాటకు కట్టుబడి హరీశ్‌రావు రాజీనామా చేయాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అడ్రస్ గల్లంతే

దుబ్బాక: తెలంగాణలో బీఆర్‌ఎస్ అడ్రస్ గల్లంతేనని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాకలో ఉన్న పార్టీ కార్యాలయంలో మండలంలోని కమ్మరపల్లికి చెందిన 30 మంది బీఆర్‌ఎస్ నుంచి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రుణమాఫీ చేస్తే హరీశ్‌రావు రాజీనామా చేస్తానని ప్రకటించాడని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పని చేయాలని డిమాండ్ చేశారు. రైతుల రుణమాఫీ చేయడాన్ని బీఆర్‌ఎస్ జీర్ణించుకోలేక పోతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మచ్చ శ్రీనివాస్, అనంతుల శ్రీనివాస్, గడీల జనార్ధన్‌రెడ్డి, కాల్వ నరేశ్, అనంతుల రాజు తదితరులు ఉన్నారు.



గజ్వేల్‌లో.. కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



హుస్నాబాద్‌లో...



దుబ్బాకటౌన్‌లో..



బెజ్జంకి(సిద్దిపేట)లో..

కేటీఆర్ వ్యాఖ్యలకు భగ్గుమన్న కాంగ్రెస్

ఆర్టీసీ ప్రయాణం చేసే మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ తక్షణమే క్షమాపణ చేయాలని కోరుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఆయా ప్రాంతాల్లో ధర్నాలు నిర్వహించారు. వెంటనే ఆయన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వం ఆడవారికి అధిక ప్రాధాన్యమిస్తూ అభివృద్ధిలో ముందుకు సాగుతుంటే ఓర్వలేని బీఆర్‌ఎస్ పార్టీ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఆయా కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ నేతలు, పీసీసీ సభ్యులు, కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. – నెట్‌వర్క్

సంక్షిప్త వార్తలు

◆ విద్యుత్ సరాఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 33/11 కేవీ ముస్తాబాద్ చౌరస్తా ,11 కేవీ రాఘవేంద్రనగర్, గాడిచెర్లపల్లి, విద్యుత్ ఫీడర్లు పరిధిలోని చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ ఏడీఈ సుధాకర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

◆ రుణమాఫీ అంతా బోగస్ : బీఆర్‌ఎస్

దుబ్బాక: కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో రైతులను పూర్తిగా మోసం చేసిందని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి, నాయకులు ఆస స్వామి, ఆస యాదగిరి అన్నారు. శుక్రవారం దుబ్బాకలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. రుణమాఫీ సగం మంది రైతులకు కూడా రాకపోవడం సిగ్గుచేటన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు భూంరెడ్డి, శ్రీకాంత్, పర్స కృష్ణ, ఖలీల్, ప్రభాకర్, రాజిరెడ్డి, లచ్చయ్య తదితరులు ఉన్నారు.

◆ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల అవస్థలు



సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల, జిల్లా ఆస్పత్రి అస్తవ్యస్తంగా ఉందని, మందులు, వసతులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం హయాంలో ఆస్పత్రిలో అందిన ఉచిత పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అమలు కావడం లేదన్నారు. టీ హబ్‌లో ప్రస్తుతం 20 రకాల పరీక్షలు మాత్రమే చేస్తున్నారని పేర్కొన్నారు. గర్భిణులకు న్యూట్రీషన్ కిట్ లేదని, టీబీ రోగులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.500 సాయం నిలిచిపోయిందన్నారు. మందుల కొరత, పారిశుద్ధ్య నిర్వహణ లోపం, పర్యవేక్షణ వైఫల్యం ప్రధానంగా ఉందన్నారు. సమావేశంలో కౌన్సిలర్ సతీష్, నాయకులు శ్రీనివాస్, నర్సింలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్‌లోకి చేరికలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట అర్బన్ పరిధిలోని వెలుకట్కూరుకు చెందిన లింగం ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

◆ బంద్ విజయవంతం

చేర్యాల(సిద్దిపేట): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. హిందువులపై, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బంద్‌కు పిలుపు ఇవ్వడంతో శుక్రవారం బంద్ ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం నుంచే దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు మూసివేశారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

◆ సీఎం చిత్రాపటానికి క్షీరాభిషేకం..

సిద్దిపేటరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసినందుకు శుక్రవారం కాంగ్రెస్ పుల్లూరు గ్రామ అధ్యక్షుడు కనకయ్య ఆధ్వర్యంలో సీఎం చిత్రాపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతులకు ఇచ్చిన మాట మేరకు ప్రభుత్వం రూ. 2లక్షలు రుణమాఫీ చేసిందన్నారు. ఇదే విధంగా త్వరలో 6 గ్యారంటీలను కూడా అమలు చేసి ప్రజాప్రభుత్వంగా మారుతుందన్నారు. పార్టీ మండల నాయకులు రాములు, శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

- మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. శుక్రవారం పట్టణంలోని 15వ వార్డులో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ, పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని కోరారు. పాత డబ్బాల్లో, టైర్లల్లో నీరు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించుకోవాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో పర్యావరణ అధికారి రవికుమార్, వార్డు ఆఫీసర్ సాంబరాజు, జవాన్లు సారయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.